క్లుప్తంగా

4న ఎస్‌ఎఫ్‌ఐ దేశవ్యాప్త బంద్



బంద్‌కు పిలుపునిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చీమకుర్తి: ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈనెల 4న దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆ సంఘం జిల్లా, మండల నాయకులు దేవరాజు, వాసుబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా నీట్ ఎగ్జామ్‌లో జరిగిన అవకతవకలను నిరసిస్తూ ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని, దానికి సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, నీట్ ఎగ్జామ్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. విద్యాసంస్థలు, విద్యార్థులు బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

హత్య కేసులో నిందితుడి కోసం వేట

మార్కాపురం: మార్కాపురం మండలంలోని వేములకోట గ్రామంలో ఈనెల 1న వృద్ధురాలు కన్నెసాని నారాయణమ్మ హత్య కేసులో నిందితుడైన శ్రీనును అరెస్టు చేసేందుకు మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. మార్కాపురం పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్, రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్‌తోపాటు మరో ఇద్దరు ఎస్సైలు రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, వినుకొండ, నర్సరావుపేట, చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లో నిందితుడి కోసం గాలిస్తున్నారు. వేములకోటకు చెందిన నారాయణమ్మ తన కుమార్తె సునీతను 16 ఏళ్ల క్రిందట యర్రగొండపాలెం మండలం యల్లారెడ్డిపల్లికి చెందిన రేళ్ల శ్రీనుకు ఇచ్చి వివాహం చేశారు. అయితే శ్రీను భార్యపై అనుమానంతో 2023 మార్చి 14న గొడ్డలితో నరికి చంపాడు. ఈ కేసులో అరెస్ట్ అయి ఇటీవలే బయటకు వచ్చాడు. తనను జైల్లో పెట్టించిందనే కోపంతో అత్త నారాయణమ్మను కూడా జూలై 1వ తేదీన నరికి చంపాడు. శ్రీనును అరెస్టు చేసేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఒంగోలు క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో నిందితుని కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు.

గాంధీ పార్క్‌ను ఆధునికీకరించాలి



నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మారెళ్ల సుబ్బారావు తదితరులు



వినతిపత్రం అందిస్తున్న సుందర్‌నగర్ ప్రాంత వాసులు

ఒంగోలు: స్థానిక గాంధీ పార్కును ఆధునికీకరించాలని ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ యోగ మిత్ర మండలి వాకర్స్ మిత్రులు కోరారు. ఈమేరకు నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంతరావును కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రహరీ స్థానంలో ఐరన్ గ్రిల్స్‌తో నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలకు, పెద్దలకు మంచి పర్యాటక కేంద్రంగా పార్కు ఏర్పడిందన్నారు. ఆరోగ్యం మెరుగుపరుచుకునేందుకు నడక–యోగ చేసేందుకు మంచి అనుకూలమైన వాతావరణంగా ఉందని, పిల్లల పార్కు ఆటలకు అనుకూలంగా పచ్చదనం పరిశుభ్రత కలిగిన ఈ పార్కుకు మరమ్మతులు చేసి ఆధునికీకరించాలన్నారు. గాంధీ పార్కు చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీ పాతదైపోయిందన్నారు. వర్షాలకు పలుచోట్ల దెబ్బతిందని, కొన్నిచోట్ల గోడ పడిపోయి ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. దాని స్థానంలో ఇరన్‌గ్రిల్స్ నిర్మిస్తే ఒంగోలు నగరానికి నడిబొడ్డులో ఉన్న పార్కు నూతన అందాలతో రూపాంతరం చెందుతుందన్నారు. పార్కుకు ప్రవేశద్వారం ఒకటే ఉండటం వల్ల ఆ రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఎక్కువైందన్నారు. నూతన ప్రవేశ ద్వారం మరో చోట ఏర్పాటు చేయాలని, దీనివల్ల ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. నగర అభివృద్ధి కమిటీ సభ్యులు మారెళ్ల సుబ్బారావు, యోగ మిత్ర మండలి నాయకురాలు కోసూరి శ్రీదేవి, తాడిపర్తి దివ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ నిర్మించాలని వినతి

ఒంగోలు: స్థానిక 35వ డివిజన్ సుందర్‌నగర్ ఏరియాలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వెనుక వైపు రోడ్డులో తూర్పు వైపున డ్రైనేజీ కాలువ నిర్మించాలని పలువురు మంగళవారం విజ్ఞప్తి చేశారు. ఈమేరకు దామా శ్రీనివాసులు, గోగినేని రామారావు, మిరియాల కిషోర్‌బాబు, గ్రంధే వెంకటేశ్వర్లు తదితరులు నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావును కలిసి విజ్ఞప్తి చేశారు. కాలువతో పాటు రోడ్డులో ఏర్పడిన గుంతలను సరిచేసి రోడ్డును తాజా పరచాలని కోరారు. అదే విధంగా హరిత వనం రోడ్డులో పడమర వైపు డ్రైనేజీ కాలువ నిర్మించాలని కోరారు.

డయేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోండి



కేక్ కట్ చేస్తున్న పీహెచ్‌సీ డాక్టర్‌లు

మద్దిపాడు: మండలంలో డయేరియా రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్‌లు ఆనంద మోహన్, శ్రావణ్, జగదీష్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో జరిగిన ఆశ డే కార్యక్రమంలో ప్రసంగించారు. సీజనల్ వ్యాధులైన టైఫాయిడ్, డెంగీ, డయేరియా వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయని అందువలన వీటిని నివారించడానికి ప్రభుత్వం గట్టిగా పని చేస్తుందన్నారు. జులై 1 వ తేదీ నుంచి అగస్టు 31 వ తేదీ వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని ఐదు సంవత్సరాల చిన్నారులకు జింక్ ట్యాబ్లెట్లు (జోడీనెంబర్1), ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలని తెలిపారు. డీపీఎంఓ వర ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల18వ తేదీ నుంచి అగస్టు 2వ తేదీ వరకూఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ డిస్ట్రక్షన్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా ఆసుపత్రిలో డాక్టర్స్ డే సందర్భంగా ఆసుపత్రి డాక్టర్‌లు కేక్ కట్ చేయగా వారికి ఆసుపత్రి సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వారి వెంట సీహెచ్‌ఓలు లలితమ్మ, రజిత కుమారి, పీహెచ్‌ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్లు బాలకోటయ్య, సీతమ్మ నాగారాజి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మాదిగల జనజాతర జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఆర్పీఎస్ నాయకులు

చీమకుర్తి: మాదిగల జనజాతర సభను జయప్రదం చేయాలని ఎంఆర్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం చీమకుర్తిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షుడు రావి నూతల కోటి ఆధ్వర్యంలో సభ్యులు జనజాతరకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. జూలై నెల 7వ తేదీ నాటికి ఎంఆర్పీఎస్ ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఆర్పీఎస్ ఉద్యమం సరిగ్గా 30 సంవత్సరాల క్రితం నాగులుప్పలపాడు మండలం ఈదుమూడిలో ప్రారంభమైన సందర్భంగా మాదిగల జనజాతర సభను ఈదుమూడిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు బక్కా రాజు, చిన్న, కిషోర్, స్థానికులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో కలెక్టర్ పర్యటన



ముంపు గ్రామాల్లో పర్యటిస్తున్న కలెక్టర్

పెద్దారవీడు: ప్రభుత్వం ద్వారా అందుతున్న సేవలు, తాగునీటి సరఫరా, మౌలిక వసతులపై వెలుగొండ ముంపు గ్రామాల ప్రజలతో కలెక్టర్ తమీమ్ అన్సారియా చర్చించారు. పెద్దారవీడు మండలం కలనూతల ప్రజలతో ఆమె మంగళవారం ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ ప్రాజెక్టుతో తాము నిర్వాసితులమవుతున్నామని ప్రజలు చెప్పారు. తమకు పరిహారం అందిస్తే ఈ గ్రామాన్ని ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నిర్వాసితులను గుర్తించేందుకు తమకు కటాఫ్ తేదీ పెంచాలని కోరారు. తమకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని ముంపు గ్రామాల ప్రజలు కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తమీమ్ అన్సారి హామీ ఇచ్చారు. అదే విధంగా దేవరాజుగట్టు వద్ద పునరావాస కేంద్రం, కాలనీలను ఆమె సందర్శించారు. ఈమె వెంట సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎస్‌ఈలు అబూత్ అలీం, మర్దన్ ఆలీ, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ ఝాన్సీలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ నాగజ్యోతి, అధికారులు ఉన్నారు.

గోమాతకు సీమంతం



గోమాతకు సీమంతం చేస్తున్న కాలనీ వాసులు

బేస్తవారిపేట: స్థానిక జంక్షన్‌లోని నక్కా వెంగయ్య హౌసింగ్ కాలనీలో గోమాతకు సీమంతం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇమ్మడి గిరిబాబు పెంచుకుంటున్న గోమాతకు కాలనీలో శ్రీమంతం ఏర్పాటు చేశారు. కాలనీ వాసులు పసుపు, కుంకుమ, చీరలు పెట్టి అంక్షింతలు వేసి వైభవంగా సీమంతం చేశారు. అందరు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

అమల్లోకి నూతన చట్టాలు



మాట్లాడుతున్న ఎస్సై నరసింహారావు

బేస్తవారిపేట: నూతన క్రిమినల్ చట్టాలు జూలై ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు ఎస్సై నరసింహారావు అన్నారు. మంగళవారం మండలంలోని జెన్నివారిపల్లెలో నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించి గొడవలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. కొత్త చట్టం ప్రకారం ఫిర్యాదుల నుంచి సమన్ల దాకా అన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతాయని వివరించారు.

ఉభయదాతలకు సన్మానం



ఉభయదాతలను సన్మానిస్తున్న యక్కలి

పొదిలి: స్థానిక శ్రీశ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కోటి కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయానికి, పూజలకు విరాళాలు అందించిన ఉభయదాతలను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముందుగా అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, నారాయణం మురళీ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఉభయదాతలు ప్రత్యేక పూజలు చేశారు. గోత్రనామాల పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. శనగపల్లి నాగేశ్వరరావు, ఆకుపాటి వెంకయ్య, గొంట్లా శ్రీనివాసరావు, పైడిమర్రి నారాయణ, మేడా నరసింహారావుతోపాటు నెల్లూరు జిల్లా సుళ్లూరుపేట నుంచి వచ్చిన ఉభయదాతలను సన్మానించారు. కార్యక్రమంలో పొనుగపాటి కోటేశ్వరరావు, పి.భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మారిన పాఠశాలల రూపురేఖలు



ఎన్‌సీసీ విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారి



స్టడీ అవర్ ప్లాట్‌ఫాం

దొనకొండ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నాడు–నేడు ప్రవేశ పెట్టి పాఠశాలలకు రూపు రేఖలు మార్చేశారు. ఈ సందర్భంగా దొనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లక్షల ఖర్చుతో అన్ని హంగులు సమకూర్చారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత ప్రమాణాలతో పురోగతి చెందుతోంది. 2023–24 విద్యా సంవత్సరంలో క్రీడాంశాలలో పాఠశాల నుంచి 43వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపటంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఎన్‌సీసీ..

34 బీఎన్ ఆంధ్రా బెటాలియన్ ఒంగోలు వారు పాఠశాలకు ఎన్‌సీసీ న్యూ ట్రూప్ మంజూరు చేశారు. విద్యార్థులు ఎన్‌సీసీ ద్వారా శిక్షణ పొందారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కె.నరసింహారావు ఎన్‌సీసీ కేర్ టేకర్ బాధ్యతలు చూస్తున్నారు. ఎన్‌సీసీని ఉపయోగించుకుని ప్రతిభ గల విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారు.

ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణత

గత విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 173 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 166 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉపాధ్యాయులు కష్టపడి పని చేసి ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు కృషి చేశారు.



జాతీయ స్థాయి ఆటలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ

ఒకేషనల్ కోర్సులు

నూతనంగా పాఠశాలలో ఒకేషనల్ కోర్సులు టైలరింగ్ మరియు బిజినెస్ కోర్సులు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. ఈ కోర్సులో చేరిన వారు భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు పొందవచ్చు.

స్టడీ ఫ్లాట్‌ఫాం

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని స్టడీ అవర్ కోసం ఫ్లాట్‌ఫాం అవసరమని గుర్తించి రూ.15 లక్షలు మంజూరు చేశారు. దీంతో విద్యార్థులు కూర్చొని చదువుకొనుటకు గ్రానైట్ స్టడీ ఫ్లాట్ ఫాం ఏర్పాటు చేశారు.

పాఠశాల ప్రత్యేకతలు

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు కృషితో విశాలమైన తరగతి గదులు, సైన్సు ల్యాబ్‌లు, డిజిటల్ బోధన, 3–10 వరకు ఆంగ్ల బోధన, విశాలమైన క్రీడా మైదానం, ఎన్‌సీసీలో ప్రత్యేకంగా శిక్షణ వంటివి ఏర్పాటు చేయించారు. గత 4 సంవత్సరాల నుంచి ఆ పాఠశాల అడ్మిషన్లు విపరీతంగా పెరిగాయి. 2021–22లో 840 మంది విద్యార్థులు, 2022–23లో 920 మంది, 2023–24లో 1003 మంది, 2024–25 విద్యా సంవత్సరానికి ఏకంగా 1100 మంది అడ్మిషన్లు జరిగినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

పెరిగిన విద్యార్థుల సంఖ్య



నాడు–నేడు పనులతో పాఠశాల అభివృద్ధి చెందింది. తరగతి గదులు నిర్మించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూర్చారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాఠశాలకు అనేక సౌకర్యాలు సమకూర్చారు.

వీవీ రామాంజనేయులు, హెచ్‌ఎం, దొనకొండ

ప్రభుత్వ వైఫల్యంతోనే హత్రాస్ ఘటన

ఒంగోలు సెంట్రల్: హత్రాస్ ఘటనలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా ఉందని సోషియల్ డెమొక్రెటిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్దుల్ సత్తార్ అన్నారు. ఘటనలో 60 మందికి పైగా చనిపోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని చెప్పారు. జన సందోహాన్ని పోగు చేయటం, క్రమశిక్షణ లేక పోవటం, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం దారుణమన్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగినా సరే ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోలేదని విమర్శించారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ. 25లక్షలు, క్షత గాత్రులకు రూ. 5లక్షలు అందించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

గ్యాస్ ఐడీతో ఫోన్ నంబర్ అనుసంధానించుకోవాలి

పొదిలి: ఆయిల్ కంపెనీల ఆదేశానుసారం వినియోగదారులు గ్యాస్ ఐడీకి తమ మొబైల్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని స్థానిక కరుణా ఇండేన్ గ్యాస్ నిర్వాహకుడు సాయి రాజేశ్వరరావు తెలిపారు. డెలివరీ బాయ్‌కి ఓటీపీ నంబర్ చెబితేనే సిలిండర్ అందజేస్తారని స్పష్టం చేశారు. ఉచిత సిలిండర్లు, సబ్సిడీ పొందడానికి ఈ కేవైసీ, బేసిక్ సేఫ్టీ చెక్ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. గడువు ముగిసిన హోస్ పైపును డెలివరీ బాయ్‌ని సంప్రదించి తగిన ధర చెల్లించి మార్చుకోవాలని సూచించారు.

విద్యార్థులు పాఠశాలల్లోనే ఉండాలి



ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

త్రిపురాంతకం: విద్యార్థులందరినీ పాఠశాలలకు పంపి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ కె.తులసిమల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. మండలంలోని గణపవరంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విద్యార్థులను పాఠశాలలకు పంపాలని ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలకు రాని విద్యార్థులందరినీ ముందుగా గుర్తించాలన్నారు. విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గించాలని సూచించారు. పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాలను మెరుగు పరచాలని మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రోశమ్మ, సీఆర్‌పీ డానీ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. గొల్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ రాజశేఖరరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామ సర్పంచ్ వెంకట తిరుమలయ్య, హెచ్‌ఎం దీప్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కార్మికుల ఆందోళన



బైఠాయించిన స్వచ్ఛ భారత్ కార్మికులు

కొమరోలు: మండల కేంద్రం కొమరోలులోని గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ ఉద్యోగులకు కొన్ని నెలలుగా వేతనాలు ఇవ్వక పోవడంతో మంగళవారం గ్రామ సచివాలయం ముందు వారు ఆందోళనకు దిగారు. మూడేళ్ల నుంచి స్వచ్ఛ భారత్ కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని, సంబంధిత అధికారులు, సర్పంచ్‌కి మొరపెట్టుకున్నా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించే వరకు తాము విధులకు హాజరు కామని కార్మికులు స్పష్టం చేశారు.

సీజ్ చేసిన భవనం కూల్చివేత



కూల్చేందుకు ప్రయత్నించిన భవనం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కాశినాయన కుంటలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని నగర పంచాయతీ అధికారులు సీజ్ చేయడంతో ఆక్రమణదారుడు శివరంగారెడ్డి కూల్చేందుకు ప్రయత్నించిన సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. అందిన వివరాల ప్రకారం.. కాశినాయకుంటలో శివరంగారెడ్డి కాశినాయన ఆలయం పక్కనే మూడు అంతస్తుల భవనం నిర్మించాడు. కుంటలో అక్రమ కట్టడం నిర్మించాడంటూ జనార్దన్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు నగర పంచాయతీ వారు భవనాన్ని సీజ్ చేశారు. సీజ్ చేసిన భవనాన్ని ఆక్రమించిన సదరు వ్యక్తి శివరంగారెడ్డి ఇటాచీ వాహనంతో కూల్చేందుకు ప్రయత్నించాడు. దీంతో సమాచారం అందుకున్న నగర పంచాయతీ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని శివరంగారెడ్డితో పాటు అతడి కుమారుని అదుపులోకి తీసకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శ్రీశైలం ఘాట్‌లో పోలీసుల తనిఖీలు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్ రోడ్డు గణపతి ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద మంగళవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అతి వేగంగా వాహనాలు నడుపుతున్న వాహనాలపై దృష్టి సారించారు. శ్రీశైలం ఘాట్‌లో వాహనాలు 30 కిమీ వేగంతో ప్రయాణించాలన్న నిబంధనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శ్రీశైలం వద్ద ఉన్న శిఖరం ఫారెస్టు చెక్‌పోస్టు నుంచి గణపతి చెక్ పోస్టు వద్దకు గంటలోపు వచ్చే వాహనాలు నిబంధనలు అతిక్రమించినట్లు. ఈ నేపథ్యంలో నిబంధనలు ఉల్లఘించిన వారిపై చలానాలు విధించారు. దీంతో పాటు సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడిపిన వారికి సైతం చలానాలు విధించారు.



వాహనాల పత్రాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ట్యాంకర్ల ఏర్పాటులో గందరగోళాన్ని నివారించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రమేష్

పెద్దారవీడు: ట్యాంకర్ల ఏర్పాటులో గందరగోళాన్ని నివారించాలని సుంకేసుల సర్పంచ్ గుడ్డెపోగు రమేష్.. కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వెలుగొండ ప్రాజెక్టు పునరావాస కాలనీలను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్‌ను ఆయన కలిసి పలు సమస్యలపై అర్జీ అందజేశారు. గ్రామంలో కొన్ని సవత్సరాలుగా అనేక వ్యయ ప్రయాసలకోర్చి నీటి సమస్యను తీర్చుతున్నామన్నారు. దీని కోసం అప్పులు చేసి ఆర్థికంగా చితికి పోయామని ఆయన కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 16 నెలల నుంచి ట్యాంకర్ల బిల్లులు రావాల్సి ఉందని విన్నవించుకున్నారు. యేర్వ సహదేవుడు, సానికొమ్ము పుల్లారెడ్డి, గుర్రం ముత్యాలయ్య, తంగిరాల పెద్ద పాపయ్య, గుడ్డెపోగు కొండయ్య, తంగిరాల దేవయ్య పాల్గొన్నారు.